క్లుప్తంగా

అందుబాటులో విత్తనాలు

వంగర: ఆరుతడి పంటల సాగుకు సంబంధించిన విత్తనాలు వెలుగు శాఖ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని ఏపీఎం మీసాల చక్రపాణి ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. రాగులు, సజ్జలు, కొర్రలు వంటి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని, కావాల్సిన వారు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మార్కెట్‌లో ఆరుతడి పంటలకు మంచి డిమాండ్ ఉండడంతో రైతులంతా ఈ పంటల పెంపకానికి ఆసక్తి కనబరుస్తుండడం విశేషం.

తాగునీటిని వృథా చేయొద్దు



ఉనుకూరులో తాగునీటి ఆవశ్యకతను వివరిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్

రేగిడి: తాగునీటిని వృథా చేయవద్దని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ సూచించారు. మండలంలోని ఉనుకూరు, చిన్నశిర్లాం, పెద్దశిర్లాం గ్రామాల్లోని రక్షిత మంచినీటి పథకాల ద్వారా ఇంటింటికీ తాగునీరు సరఫరా అవుతున్న పైపులైన్లను ఆయన శుక్రవారం పరిశీలించారు. అక్కడక్కడా పాడైన పైపులైన్ల మరమ్మతులు చేయించారు. కొన్నిచోట్ల కుళాయిల వద్ద వృథాగా పోతున్న నీటిని చూసి, అక్కడి వారికి తాగునీటి ప్రాధాన్యతను వివరించారు. ఒక్కబొట్టు నీరు కూడా వృథా కావడానికి వీలులేదని, నీరు పట్టుకున్న వెంటనే కుళాయి ట్యాప్ కట్టేయాలని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



పూజలందుకున్న మహాలక్ష్మి అమ్మవారు

వంగర: మండలంలోని సంగాంలో వెలసిన శ్రీసంగమేశ్వరస్వామి సన్నిధిలో ఉన్న శ్రీకనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు చిన్నిబాబు ఆధ్వర్యంలో సూక్మ సహిత పారాయణం, లలిత సహస్ర నామ పారాయణం తదితర పూజలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన చాలామంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని, విశేష పూజలు చేశారు.

సురక్షితమైన నీటినే తాగండి



తాగునీటి పరిశుభ్రతను పరీక్షిస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్రీరామ్ తదితరులు

తెర్లాం: ప్రతిరోజూ సురక్షితమైన మంచినీటినే తాగాలని స్థానిక సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్రీరామ్, ఏఎన్ఎం ప్రభావతిలు సూచించారు. స్థానిక సచివాలయం-2లో బోరుబావుల నీటి పరిశుభ్రతను పరీక్షించే కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. వారు మాట్లాడుతూ మనం తాగేనీటితోనే అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, ఈ నేపథ్యంలో మనం తాగేనీరు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. వీలైనంత వరకు కాచివడపోసిన నీటినే తాగాలని, రోజుకు 4 నుంచి 5 లీటర్ల నీటిని తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటామన్నారు.

'నీట్'లో విద్యార్థిని సత్తా



శరణ్య

బొబ్బిలి రూరల్: నీట్ పరీక్ష ఫలితాల్లో మండలంలోని పక్కి గ్రామానికి చెందిన విద్యార్థిని శంబంగి శరణ్య సత్తా చాటింది. 720 మార్కులకు గాను 695 మార్కులు సాధించి, ఓబీసీ కేటగిరీలో 1039వ ర్యాంక్ సొంతం చేసుకుంది. దీంతో సదరు విద్యార్థిని పలువురు అభినందిస్తున్నారు.

నిరంతర పర్యవేక్షణ అవసరం



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్జేడీ చిన్మయిదేవి

గంట్యాడ: అంగన్‌వాడీ కేంద్రాలను నిరంతరం పర్యవేక్షణ చేయాలని స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆర్జేడీ జి.చిన్మయిదేవి అన్నారు. మండల కేంద్రంలోని సీడీపీఓ కార్యాలయాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలు అధిక సంఖ్యలో హాజరయ్యేటట్టు చూడాలని సూచించారు. పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యను అందించాలన్నారు. అలాగే లబ్ధిదారులకు పౌష్టికాహారం పూర్తిస్థాయిలో అందేలా చూడాలన్నారు. అనంతరం కార్యాలయం ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీడీపీఓ డోకుల ఉమాభారతి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



రామభద్రపురం గ్రంథాలయంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో తిరుమలప్రసాద్



తెర్లాం గ్రంథాలయంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి



బాడంగి: బాడంగిలో విద్యార్థులకు అట్టలు అందజేస్తున్న ఎంఈవో రాజేశ్వరి



తెర్లాం: విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎంఈవో పాపారావు

వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ప్రభుత్వ శాఖా గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. రోజూ తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు సరదా వాతావరణంలో ఆటపాటలతో కూడిన విద్యనందిస్తూనే మంచి నడవడిక, మెదడుకు పదును పెట్టే పజిల్స్, చదరంగం, క్విజ్ పోటీలు నిర్వహించారు. అలాగే సృజనాత్మకత వెలికితీసేలా క్రాఫ్ట్ వర్క్, వక్తృత్వం, చిత్రలేఖనంపై కూడా శిక్షణ ఇచ్చారు. ఆయా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి అతిథుల చేతులమీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వాటిని వినియోగించుకుంటే అపారమైన జ్ఞానం మన సొంతమవుతుందన్నారు. ప్రతిఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్.



బొబ్బిలి: వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సభలో పాల్గొన్న వక్తలు

వార్షిక తనిఖీలు



రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

బాడంగి: మండల విద్యావనరుల కేంద్రంలో జిల్లా విద్యాశాఖాధికారులు శుక్రవారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఏడాది పాటు అమలైన అన్ని సంక్షేమ పథకాలకు సంబంధించిన రికార్డులను సూపరింటెండెంట్ ఎస్.సాంబశివరావు, సీనియర్ అసిస్టెంట్ రాజ్‌కుమార్ పరిశీలించారు. అమ్మఒడి, విద్యాకానుక, మనబడి నాడు-నేడు, పాఠశాలల రికార్డులు, ఉపాధ్యాయుల జీతభత్యాలు, శిక్షణా తరగతుల వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, డీఈవోకు అందించేందుకు నివేదికను సిద్ధం చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు లక్షణదొర, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

లాభదాయకంగా ప్రకృతి వ్యవసాయం



ప్రకృతి సేద్యంపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: ప్రకృతి వ్యవసాయం లాభదాయకంగా ఉంటుందని, రైతులంతా ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ముందుకురావాలని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనీ సీహెచ్ శారద కోరారు. మండలంలోని సోమరాజుపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసే పంటలు, వాటి ద్వారా కలిగే ప్రయోజనాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రకృతి సేద్యం చేస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అలాగే చీడపీడలు, తెగుళ్లు సోకని ఆరోగ్యవంతమైన పంట చేతికి వస్తుందన్నారు. సమావేశంలో సర్పంచ్ సవళాపురపు ముద్దలమ్మ, మాజీ ఎంపీటీసీ సవళాపురపు నర్సిమప్పారావునాయుడు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

రాజాం సిటీ:

పట్టణంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ ఏఈ వెంకట్ తెలిపారు. స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామంలో మరమ్మతులకు గురైన తాగునీటి బోరును మెకానిక్‌లు శ్రీనివాస్, సత్యంనాయుడు, అప్పలరాజులు శుక్రవారం బాగు చేశారు. అలాగే బొబ్బిలి రోడ్డులోని ప్రధాన వాటర్ ట్యాంకు నుంచి తాగునీరు సరఫరా చేస్తున్న ప్రధాన పైపులైన్ మరమ్మతులను కూడా చేపట్టారు.



పొనుగుటివలసలో పాడైన బోరును బాగుచేస్తున్న మెకానిక్‌లు

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు



పోతులజగ్గుపేట-లాబాం వంతెన దగ్గర నదిలోకి వాహనాలు వెళ్లకుండా తవ్విన కందకాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సంతకవిటి: అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా గనుల శాఖ డీడీ సీహెచ్ సూర్యచంద్ర హెచ్చరించారు. మండలంలోని తమరాం గ్రామ వద్ద ఉన్న పాత ఇసుకరీచ్‌తో పాటు పోతులజగ్గుపేట, మేడమిర్తి గ్రామాల్లోని నాగావళి నదీతీరాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఎవరైనా ఇసుక తరలిస్తే వెంటనే తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఎస్ఈబీ ఎస్ఐ చంద్రశేఖర్, తహసీల్దార్ తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ అధ్యక్ష పదవికి రాజీనామా

గుర్ల: మండలంలోని తెట్టంగి ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు తిరుమలరాజు రవిబాబు తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని సొసైటీ సీఈఓ బెల్లాన రామునాయుడుకు శుక్రవారం అందజేసినట్లు చెప్పారు. వ్యక్తిగత కారణాల వల్ల సొసైటీ అధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్లు వెల్లడించారు. రవిబాబు రాజీనామా పత్రాన్ని డీసీసీబీ సీఈఓకు అందజేస్తానని సొసైటీ సీఈఓ రామునాయుడు తెలిపారు.

9న ఉత్తరాంధ్ర వాలీబాల్ పోటీలు

దత్తిరాజేరు: మండలంలోని మరడాం ఉన్నత పాఠశాలలో తాడి నరేంద్రకుమార్ జ్ఞాపకార్థం ఈ నెల 9న ఉత్తరాంధ్ర స్థాయిలో వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు నరేంద్రకుమార్ కుటుంబ సభ్యులు శుక్రవారం తెలిపారు. డే అండ్ నైట్ నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న జట్లు రూ.300 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. విజేత జట్టుకు రూ.20 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.15వేలు, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.8 వేలు నగదు ప్రోత్సాహకం అందజేయనున్నట్లు తెలిపారు.

'పచ్చ'దనం పరిశుభ్రత



గడిముడిదాం చెరువుగట్టుపై వేసిన మొక్కల చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలను తొలగిస్తున్న వేతనదారులు

రాజాం సిటీ: మండలంలోని గడిముడిదాం, కంచరాం, పెనుబాక, ఆగూరు గ్రామాల్లోని అమృత్ సరోవర్ చెరువుల వద్ద ఉపాధి హామీ పథకం వేతనదారులతో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. చెరువు గట్లపై వేసిన మొక్కల చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలు తొలగించడంతో పాటు వాటి పరిరక్షణకు చర్యలు చేపట్టామని ఏపీవో కె.సాయిరాం తెలిపారు. ఈ నెల 12వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఈసీ శ్రీనివాసరావు, టీఏలు గురయ్య, ఆర్.ప్రసాద్, ఎఫ్ఏలు లావేటి శిరీష, కలిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'ని సద్వినియోగం చేసుకోండి



వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీవో హరనాథ్

రేగిడి: గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వలసల నివారణే లక్ష్యంగా ప్రభుత్వం అమలుచేస్తున్న ఉపాధి హామీ పథకం పనులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీవో ఎస్.హరనాథ్ సూచించారు. మండలంలోని కొమిర, లక్ష్మీపురం, ఆడవరం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.300 గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు. రోజుకు రెండుపూటలా చల్లగా ఉన్న సమయంలోనే పనులు చేయాలని, పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్‌లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పిడుగుల బారినపడకుండా వర్షం పడే సూచనలున్నప్పుడే బయలుదేరి ఇంటికి వెళ్లిపోవాలని తెలిపారు.

సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతుల ఆసక్తి



అంబకండి గ్రామ పొలాల్లో పేడగత్తం వేస్తున్న రైతులు

రేగిడి: మండలంలోని చాలా గ్రామాల రైతులు సేంద్రియ ఎరువుల వినియోగంపై ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రతీ గ్రామం వెళ్లి, ప్రకృతి సేద్యం, సేంద్రియ ఎరువుల వాడకం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తుండడంతో చాలామంది అన్నదాతలు సేంద్రియ ఎరువులు వాడేందుకు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లోని రైతులు నేల సారవంతానికి పేడగత్తంను పొలాల్లో వేస్తున్నారు. మండలంలోని వన్నలి, అంబకండి, ఉంగరాడ, ఉప్పర్నాయుడువలస, చాటాయివలస తదితర గ్రామాల్లోని రైతులంతా ఈ సేంద్రియ ఎరువులు అధికంగా వాడుతుండడం విశేషం.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం



నవధాన్యాల సాగుతో కలిగే ప్రయోజనాలను వివరిస్తున్న ఏవో సునీల్‌కుమార్

తెర్లాం: రైతులు తమ పంటపొలాల్లో నవధాన్యాలు సాగు చేసుకోవడం ద్వారా నేల సారవంతంగా తయారై, పంటలు బాగా పండుతాయని మండల వ్యవసాయాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. మండలంలోని పెదపాలవలస గ్రామంలో నవధాన్యాల సాగు-ప్రయోజనాలపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ నవధాన్యాలు సాగుతో నేల సారవంతమై అందులో పండే పంటకు చీడపీడలు, తెగుళ్ల బెడద ఉండదన్నారు. అలాగే ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయన్నారు. ప్రతీ రైతు ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబిస్తూ వ్యవసాయం చేయాలన్నారు. పంటల్లో రసాయన ఎరువుల వినియోగం తగ్గించి, సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలన్నారు. కార్యక్రమంలో ఏపీసీఎఫ్ యూనిట్ ఇన్‌చార్జ్ తులసి, ఐసీఆర్‌పీ బంగారం తదితరులు పాల్గొన్నారు.

రాజాం: మండలంలోని గార్రాజుచీపురుపల్లి, బొమ్మినాయుడువలస గ్రామాల్లో ఉన్న రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానాలు, వాటిని అవలంబిస్తూ వ్యవసాయం చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలను ప్రకృతి వ్యవసాయం డీపీఎంయూ ఆనందరావు శుక్రవారం వివరించారు. పొలాల్లో నవధాన్యాలు వేసుకోవాలని, అవి మొక్కలైన తర్వాత వాటిని నేలలో దున్నుకోవాలన్నారు. అలా చేస్తే నేల సారవంతమై, పంటకు కావాల్సిన పోషకాలన్నీ నేల ద్వారానే అందుతాయన్నారు. తద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఎస్ఎఫ్ఏ రేఖ, వీఏఏ జాన్సీ, యూనిట్ ఇన్‌చార్జ్ రమాదేవి, ఐసీఆర్‌పీ శ్రావణి పాల్గొన్నారు.



రాజాం: నవధాన్యాలను బస్తాల్లోకి నింపుతున్న దృశ్యం

ఆరోగ్యమే మహాభాగ్యం

రేగిడి:

ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతిఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రాజాం ఐసీడీఎస్ పీవో కనకదుర్గ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పిల్లల పెంపకంలో కుటుంబ పాత్రపై అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలకు శుక్రవారం ఇచ్చిన ఒక్కరోజు శిక్షణకు హాజరైన ఆమె.. పిల్లల ఆరోగ్యం, వారి ప్రవర్తన వారు పెరిగే వాతావరణంపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. పిల్లలను మంచి వాతావరణంలో పెంచితే మంచిగా తయారవుతారన్నారు. చిన్నతనం నుంచే పిల్లలకు పౌష్టికాహారం అందివ్వాలన్నారు. పిల్లల ఆరోగ్యం, ప్రవర్తనపై ఎప్పటికప్పుడు దృష్టిసారించాలని, వారిని సక్రమమైన మార్గంలో నడిపించాలన్నారు. రేగిడి సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పి.శశికళ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారం తప్పనిసరిగా వారికి అందేలా చూడాలని తెలిపారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శశికళ

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

గుర్ల: చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందించేలా తల్లులకు అవగాహన కల్పించాలని గరివిడి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి ఆరుద్ర సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. చిన్నారులకు తల్లి పాలతో పాటు అవసరమైన పౌష్టికాహారం అందించే విధంగా తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ మేరకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఏ చిన్నారీ పౌష్టికాహార లోపంతో బాధపడకుండా చూడాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉందన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన తప్పనిసరి..

పాలకొండ రూరల్: సంబంధం లేని ఘర్షణల్లో చిక్కుకోవడం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలు, యువత అవగాహన పెంచుకోవాలని పాలకొండ ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల కోడ్‌ను ఎత్తివేస్తున్న క్రమంలో శుక్రవారం రాత్రి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి అవగాహన కల్పించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేలా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. బుక్కూరు, అవలంగి, వెలగవాడ, సిరికొండ, తదితర గ్రామాల ప్రజలతో మమేకమయ్యారు.